క్లుప్తంగా

మంత్రిని కలిసిన కోఆప్షన్ సభ్యుడు



మహాముత్తారం: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబును బుధవారం మండల కోఆప్షన్ సభ్యుడు నజీర్ ఖాన్ హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు అట్టెం రమేష్, రామోజీ, రత్నం సడువలి తదితరులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మల్హర్: తాడిచర్ల కేడీసీ (సహకార సంఘం) బ్యాంకు ఆధ్వర్యంలో మండలంలోని పెద్ద తూండ్ల గ్రామ పంచాయతీ ఆవరణలో ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు మేనేజర్ వెంకటరాజం, సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత, బ్యాంక్ అందిస్తున్న సేవలు, డిజిటల్ బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, చిన్న చిన్న పొదుపుతో ఎలా కుటుంబాన్ని మెరుగుపర్చుకోవడం, నగదురహిత లావాదేవీలు, సైబర్‌మోసాలపై తదితర వాటిపై గ్రామస్తులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ నాగేశ్వర్‌రావు, సీసీ నాగరాజు, సురేష్, శ్రీనివాస్, బ్యాంక్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జీప్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా రాజయ్య



చిట్యాల: ఆదర్శ జీప్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మాసు రాజయ్యను అసోసియేషన్ సభ్యులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఓదెల శ్రీహరి, కోశాధికారి అన్నం రఘుపతితో పాటు 14 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు రాజయ్య మాట్లాడుతూ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ప్రైవేటు వాహనదారుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. వాహనాలనే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న వారికి ఉపాధి కోల్పోయినట్లు అయిందన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ వాహనదారులను ఆదుకుని జీవనభృతి కల్పించాలని కోరారు.

ఎడపల్లిలో ఉచిత వైద్య శిబిరం



మహదేవపూర్: మండలంలోని ఎడపల్లి గ్రామంలో బుధవారం డాక్టర్ సుష్మిత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 24 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులతో సమవేశం నిర్వహించి కీటకజనిత వ్యాధుల వల్ల కలిగే అనర్థాలను వివరంచారు. అలాగే దోమలు పెరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తూ నీటి నిల్వ ప్రదేశాల్లో దోమలు పెరుగుతాయని నీటిని నిల్వ ఉంచకుండా శుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాజరమణయ్య, ఏఎన్‌ఎంలు వెంకటమ్మ, మల్లీశ్వరీ, ప్రజలు పాల్గొన్నారు.

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



వాజేడు: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ శారద, సర్పంచ్ పూనం నరేశ్ అన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని మొరుమూరు గ్రామ పంచాయతీలో బుధవారం యువతకు క్రీడలకు సంబంధించిన ఆట వస్తువులను వారు పంపిణీ చేశారు. క్రికెట్, వాలీబాల్ కిట్లను యువతకు అందించారు.

నత్తనడకన సాగుతున్న పనులు



నిలిచిన వంతెన నిర్మాణ పనులు



నీటి ప్రవాహంలో మానేరు దాటుతున్న ప్రయాణికులు (ఫైల్)

ఎనిమిదేళ్లుగా పూర్తికాని అంతర్ జిల్లా వంతెన
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు, కాంట్రాక్టర్

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి–కలికోట శివారు మానేరు వాగుపై రూ.50 కోట్లతో నిర్మిస్తున్న అంతర్ జిల్లా వంతెనను 2015 ఆగస్టులో అప్పటి ఎమ్మెల్యే, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే పుట్ట మధులు ఆర్భాటంగా ప్రారంభించారు. అప్పటి నుంచి వంతెన నిర్మాణ పనులు ఆధునిక టెక్నాలజీతో జరుగుతున్నా నేటి వరకు పనులు నత్తనడకన సాగుతున్నాయి. వంతెన నిర్మాణం పూర్తయితే పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రజలకు రవాణా దూర భారం తగ్గి జయశంకర్ భూపాలపల్లి ప్రజలకు ప్రయాణం సౌకర్యంగా ఉంటుంది. కానీ కాంట్రాక్టర్, పాలకుల నిర్లక్ష్యంతో వంతెన నిర్మాణం నిలిచిపోయింది.

ఓడేడ్ రైతులకు తప్పని తిప్పలు

మానేరువాగు అవతలి గ్రామాలైన పెద్దపల్లి జిల్లా, ముత్తారం మండలంలోని ఓడేడ్, అడవిశ్రీరాంపూర్ వంటి గ్రామాల రైతుల వ్యవసాయ భూములు ఎక్కువగా టేకుమట్ల మండలంలోని కలికోట శివారులో ఉండడంతో ప్రతి రోజు రైతులు వాగు దాటి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఓడేడ్ గౌడ కార్మికులకు తాటి వనం మొత్తం కలికోట శివారులో ఉండడంతో నిత్యం వాగుదాటి రావాల్సింది. ఇక వర్షాకాలంలో మానేరులో నీటి ప్రవాహం ఎక్కువైందంటే రైతులు, గౌడ కార్మికుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మానేరులో వేసిన తాత్కాలిక రోడ్డు మధ్యలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంతో వాహన సౌకర్యం నిలిచిపోవడంతో ప్రజలు, రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

తగ్గనున్న దూర భారం

వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం, సింగరేణిలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు మానేరులో నీళ్ల రావడంతో భూపాలపల్లి, కాటారం మీదుగా సుమారు 150 కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మండలం నుంచి కాల్వశ్రీరాంపూర్ మీదుగా పెద్దపల్లికి చేరుకునే ప్రయాణికులు కూడా అధిక దూరం ప్రయాణించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన వారు కేవలం 50 కిలోమీటర్ల దూరంలో గోదావరిఖని, పెద్దపల్లి జిల్లాలకు చేరుకునే సౌకర్యం ఉంటుందని పలువురు అంటున్నారు.

తాత్కాలిక రోడ్డుతో ప్రయాణికులకు ఊరట

ప్రస్తుతం మానేరు వాగులో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో నిర్మించిన తాత్కాలిక రోడ్డు ప్రయాణికులకు ఊరటనిస్తుంది. ప్రతీ ఎండాకాలంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డుతో ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్తున్నారు. మరో రెండు నెలల్లో వర్షాకాలం మొదలు కానున్న తరుణంలో ఇప్పటివరకు నిలిచిన వంతెన నిర్మాణ పనులు మొదలు కాకపోవడంతో మరో రెండేళ్లు వెనక్కి వెళ్లినట్టేనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర బిందువు కానున్న టేకుమట్ల

మానేరుపై వంతెన నిర్మాణం పూర్తయితే కరీంనగర్, పరకాల, గోదావరిఖని, హనుమకొండ పట్టణాలకు టేకుమట్ల కేంద్ర బిందువుగా మారనుంది. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాలకు కేంద్ర బిందువుగా వ్యాపారపరంగా ఎంతో వృద్ధి చెంది పట్టణ శోభను సంతరించుకుంది. ఇక వంతెన నిర్మాణం పూర్తి అయితే మినీ పట్టణంగా రూపు దిద్దుకుంటుందని పలు గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

రవాణా సౌకర్యం పెరుగుతుంది



వంతెన నిర్మాణం పూర్తయితే మంచిర్యాల, గోదావరిఖని, పెద్దపల్లి వంటి నగరాల నుంచి కరీంనగర్, జమ్మికుంట, పరకాల, వరంగల్‌లకు రవాణా సౌకర్యం పెరిగి ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుంది. అధికారులు, నాయకులు స్పందించి వీలైనంత త్వరగా వంతెన నిర్మాణం పూర్తి చేయాలి.

– దాసారపు భాస్కర్
గర్మిళ్లపల్లి

వంతెన పూర్తయితే బాధలు తప్పతాయి



మాకు వ్యవసాయ పొలం, తాటిచెట్లు కలికోట శివారులోనే ఉన్నాయి. వాగులో నీళ్లు పెరిగితే మాకు రాకపోకలు స్తంభించిపోతాయి. తాటి చెట్లు ఎక్కి పొట్టపోసుకునే మాకు మధ్యలో ఉన్న వాగుతో గోసైతంది. త్వరగా వంతెన నిర్మిస్తే మా బాధలు తప్పుతాయి.

– ఒగులవేని వీరేశం, ఓడేడ్

మంత్రిని కలిసిన ముస్లింలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముస్లిం నాయకులు

కాటారం: మండలానికి చెందిన ముస్లిం పెద్దలు, యువకులు, నాయకులు బుధవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలోని చింతకాని, విలాసాగర్, గంగారం, అంకుషాపూర్, ఇబ్రహీంపల్లి, దేవరాంపల్లి గ్రామాల్లో ఈద్గా, ఖబ్రస్తాన్ నిర్మాణాలు, కాటారంలో పెండింగ్‌లో ఉన్న షాదీఖానా నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు. త్వరలోనే అధికారులతో మాట్లాడి నిర్మాణాలు పూర్తయ్యేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. మంత్రినికి కలిసిన వారిలో మండల కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ అజీజ్, సీనియర్ నాయకులు చోటేమియా, దాదామియా, కలీం, సలీం, కయ్యూం తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీఓలు



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీడీఓలు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన గండ్ర సత్యనారాయణరావును మండల పరిషత్ అభివృద్ధి అధికారులు బుధవారం పార్టీ కార్యాలయంలో సంఘం తరఫున మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను అమలు చేయడంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారుల పాత్ర కీలకం అన్నారు. అధికారులు ఇక నుంచి బాగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారిణి విజయలక్ష్మి, మాట్లాడుతూ జిల్లాలో ఎంపీడీఓలు అందరూ బాగా పని చేస్తున్నారని ఇకపై కూడా ప్రభుత్వానికి ప్రజలకు పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యేకు తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం అధ్యక్షుడు మహాముత్తారం ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి భూపాలపల్లి ఎంపీడీఓ అనిల్ కుమార్, ఎంపీడీఓలు సురేందర్, మాలోతు శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులు

రేగొండ: ఉపాధి హామీ పథకం కింద మండలంలోని అన్ని గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీఓ సురేందర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నర్సరీ ఏర్పాటు గురించి సమీక్షించిన ఆయన గ్రామాల్లో 50 మందికి తక్కువ కాకుండా కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పనులు కోరిన ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిని కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ జమీర్, టెక్నికల్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మకు మొక్కులు చెల్లించిన ఎంపీటీసీ



ఊట్లపల్లి పోచమ్మ వద్ద మొక్కులు చెల్లిస్తున్న ఎంపీటీసీ, మహిళా నాయకులు

కాళేశ్వరం: కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం, మంథనిలో దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గెలుపొందడంతో మహదేవపూర్ మండలం అన్నారం సమీపంలోని ఊట్లపల్లి పోచమ్మ దేవాలయం వద్ద కాళేశ్వరం ఎంపీటీసీ రేవెల్లి మమత, కాంగ్రెస్ మహిళా నాయకులతో కలిసి బుధవారం మొక్కులు చెల్లించారు. కాగా, ఆమె మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరుగలేదని, శ్రీధర్‌బాబుతో అభివృద్ధి సాధ్యమని ఆమె అన్నారు.

మేడారంలో...

మంథని నియోజకవర్గం ఎమ్మెల్యేగా శ్రీధర్‌బాబు గెలవడంతో మహదేవపూర్ మండలం ఎస్సీ సెల్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జాడి శివరామకృష్ణ, మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మలకు బుధవారం మొక్కులు చెల్లించారు.

విధుల నుంచి తొలగించాలి



ఐటీడీఏ పీఓ అంకిత్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

ఏటూరునాగారం: ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న ఈఈ, డీఈలను విధుల నుంచి తొలగించాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా వెంకట్ అన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ పీఓ అంకిత్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో మేడారం సమ్మక్క సారలమ్మ జాతర పనుల్లో చాలా అవినీతి అక్రమాలకు పాల్పడిన ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న ఈఈ, డీఈలను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ శాఖలో గత మేడారం పనుల్లో చేసిన అధికారులను జోక్యం చేసుకోకుండా కొత్త వాళ్లను నియమించి మేడారం పనులను అప్పగించాలని కోరారు. గతంలో చేసిన తప్పులను మళ్లీ చేయకుండా ఉండాలంటే గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈఈ, డీఈలు బాధ్యత వహించాలన్నారు. ఐటీడీఏ నిబంధనలకు విరుద్ధంగా వీడీసీల ద్వారా జనరల్ డిపార్ట్‌మెంట్ వర్క్‌లు కేటాయించి అధికారులు గిరిజనేతర కాంట్రాక్టర్లకు అప్పగించడంతో గిరిజనుల లక్ష్యం దెబ్బతింటుందన్నారు. ఏటూరునాగారంలో డీఈ, ఏఈలను నియమించలేదని, దీంతో పనులు ముందుకు సాగడం లేదన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌నాయక్, శ్రీనివాస్, భాస్కర్, నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి



వాజేడు : విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని వాజేడు ఎంపీడీఓ విజయ అన్నారు. మండలంలోని నాగారం గ్రామంలో ఉన్న మండల పరిషత్ పాఠశాలను బుధవారం పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం ఆమె వారితో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి చక్కగా చదువుకోవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఆమె వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ ఉన్నారు.

మిర్చి తోటలను పరిశీలించిన అధికారులు



మిర్చి తోటను పరిశీలిస్తున్న అధికారులు

మంగపేట : మండలంలోని రాజుపేట, కత్తిగూడెం, వాడగూడెం తదితర గ్రామాల్లో సాగుచేసిన మిర్చి తోటలను మండల స్పెషలాఫీసర్ తుల రవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు ఇటీవల తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు మిర్చి తోటలకు ఏమైనా నష్టం జరిగిందా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మండల వ్యవసాయాధికారి చేరాలు, ఎంపీడీఓ శ్రీధర్‌తో కలిసి పంటలను పరిశీలించామన్నారు. ఈ సందర్భంగా వర్షాల ప్రభావంతో ఏదైనా పంట నష్టం జరిగిందా అనే విషయాన్ని రైతులను అడిగి తెలుసుకున్నామన్నారు. వర్షాల కారణంగా అక్కడక్కడా నీరు నిలవడంతో మొక్కలు వాలిపోయినట్లు తమ పరిశీలనకు వచ్చిందన్నారు. తమ పరిశీలనలో జరిగిన నష్టాన్ని కలెక్టర్‌కు నివేదిక అందచేస్తామన్నారు. వారి వెంట ఏఈఓ మహేష్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాల ఏర్పాటు

వాజేడు: మండలంలోని ఏడ్జర్లపల్లి, కొత్తూరు గ్రామాల్లో బుధవారం స్థానిక వైద్యాధికారులు మహేందర్, మధుకర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని రోగులను పరీక్షించి వారికి మందులను అందించారు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న వారికి మందులను అందించడంతో పాటు రక్త నమూనాలను సేకరించారు. గర్భిణులను పరీక్షించి పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని సూచించారు. శిబిరంలో సీహెచ్‌ఓ సూర్యప్రకాష్, కోటిరెడ్డి, శ్రీను , ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన నిరవధిక సమ్మె

ఏటూరునాగారం: గ్రామీణ తపాలాశాఖ ఉద్యోగులు తపాలా కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం రెండోరోజుకు చేరింది. మండలంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ త పాలా శాఖ ఉద్యోగులకు ధర్నా కొనసాగించా రు. ఈ సందర్భంగా బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ స య్యద్ వహీద్ మాట్లాడుతూ కేంద్ర యూని యన్ల జేఏసీ పిలుపు మేరకు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ దామెర ప్రశాంత్, హుస్సేన్, సత్యనా రాయణ, బిందు, జబీర్, బాబు, పూర్ణ పాల్గొన్నారు.

ఆలయంలో మహిళల కుంకుమార్చన



పట్టణంలోని కుంకుమేశ్వరస్వామి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

పరకాల: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం కుంకుమార్చన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోమాళ్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా దాతల సాయంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీపోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకటయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణంశర్మ, ధర్మకర్తలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తరగతి గదుల కొరత

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- కనీస సౌకర్యాలు కల్పించాలని తల్లిదండ్రుల వేడుకోలు



తరగతి వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని బయ్యక్కపేట గ్రామంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉన్న మండల పరిషత్ పాఠశాలలో తరగతి గదుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 3వ తరగతి వరకు విద్యార్థులు విద్యఅభ్యసిస్తున్నారు. పాఠశాలలో 26 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పాఠశాలకు ఒక తరగతి గది ఉంది. అంతేకాకుండా పాఠశాల చుట్టు భవనాలు నిర్మించడంతో వెంటిలేషన్ కూడా లేకపోవడంతో తరగతి గదిలో చీకటిగా ఉండడంతో విద్య బోధించడం సౌలభ్యంగా లేకపోవడంతో తరగతి భవనం వరండాలో విద్యార్థులను కూర్చొబెట్టి పాఠాలు బోధించాల్సి వస్తుందని హెచ్‌ఎం నరేష్ తెలిపారు. విద్యార్థులకు సౌకర్యంగా ఉండేందుకు అదనపు వసతి కల్పించాలని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి కోరినట్లు తెలిపారు.అధికారులు స్పందించి అదనపు తరగతి గది నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

దారి పొడవునా ధాన్యం రాశులు



వెలిశాల–గర్మిళ్లపల్లి ప్రధాన రోడ్డు వెంట రైతులు ఆరబోసిన ధాన్యం

టేకుమట్ల: వరి పంటలు కోతకొస్తున్నాయంటే రైతులకు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో రైతుల ధాన్యాన్ని కొనేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కానీ వరి కోతలు మొదలయ్యే సమయానికి కొనుగోలు కేంద్రాల్లో కళ్లాలను సిద్ధం చేయకపోవడంతో రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు నానాతిప్పలు పడుతున్నారు. ఖాళీ స్థలం ఎక్కడుంటే అక్కడే ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. అందులో భాగంగానే మండలంలోని వెలిశాల–గర్మిళ్లపల్లి ప్రధాన రోడ్డు వెంట రైతుల ధాన్యాన్ని ఆరబోయడంతో దారి పొడవునా ధాన్యం రాశులే దర్శనమిస్తున్నాయి.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

మంగపేట: మండలంలోని కమలాపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేశారు. మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ్ అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, గ్రామస్తులు వివిధ రకాల సమస్యలను కార్యదర్శికి వివరించారు. గ్రామంలో సైడ్ డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, కోతులు, కుక్కల బెడదను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఓవర్‌హెడ్ ట్యాంక్ మరమ్మతు చేపట్టి తాగునీరు వృథాగా పోకుండా చూడాలన్నారు. మిషన్‌భగీరథ నీరు రావడం లేదని, గ్రామపంచాయతీ కుళాయిల నీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



భిక్ష కార్యక్రమానికి హాజరైన మాలధారులు

ఏటూరునాగారం: మండలంలోని చెల్పాక గ్రామంలో అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. మాలధారణ గురుస్వామి బోడ సత్యం, బోడ శంకర్ గృహంలో పదునెట్టాంబడితో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. 18 మెట్లకు జ్యోతిలను వెలిగించి అయ్యప్పస్వామి పాటలతో చెల్పాక గ్రామం మార్మోగింది. అయ్యప్పస్వామి మాలధారులకు బిక్ష(అన్నదానం) కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకాలు, గంధం, బస్మాభిషేకం, పన్నీరు, కుంకుమ, పుష్పాభిషేకాలను చేపట్టారు. మహిళలు, స్వాములు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.